## 10

# రక్షణ గూర్చి ఆదర్శప్రాయమైన ఉదాహరణమును సంఘమునకు గుర్తుచేయవలసి యున్నది

## (1 కొరింథీయులకు 10:1-4)

1 కొరింథీయులకు 8–10 అధ్యాయములలో, విగ్రహములకు అర్పింపబడిన మాంసమును తినుటకు సంబంధించి తలెత్తిన ప్రశ్నకు ప్రతిస్పందనగా పౌలు ఒక సుదీర్ఘ మైన భాగమును చేర్చియున్నాడు (8:1). ఈ ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చిన తరువాత, ఇతరులు రక్షింప బడినారని రూఢిపర్చుకొనుటకు అవసరమైనదెల్లా చేయువాని గూర్చి ఆయన తననుతానే ఒక మాదిరిగా ఉపయోగించుకొన్నాడు. ఇటువంటి ఆహారం ఇతరులు తొట్రిల్లుటకు కారణమయ్యే పరిస్థితి ఏర్పడినట్లయితే ఆయన దానికి పూర్తిగా దూరముగా నుండునని చెప్పుచున్నాడు (8:13). తరువాత, బహుశ విగ్రహములతో ఏ విధమైన పొత్తు కలిగియుండుట వలన కలుగు అపాయములను చూపించుటకు కాబోలు, అరణ్యములో సంచరించిన ఇశ్రాయేలీయులను ఉదాహరణముగా పేర్కొనుచున్నాడు (10:1–4).

ఈ వాక్యభాగము యింకా కొంచెము విశాల దృక్పథముతో కూడ అన్వయించుకొనవచ్చును. పౌలు ఇశ్రాయేలీయుల అనుభవమును కొరింథీయుల అనుభవముతో పోల్చుచు – కాబట్టి క్రైస్తవులమైన మన స్వంత అనుభవముతో కూడ పోల్చుచు – ఒక విధమైన వివరణాత్మక విషయముతో కూడిన ప్రసంగమును చేయుచుండెను. ఇశ్రాయేలీయుల విడుదల మరియు వారు అరణ్యములో సంచరించుట మన రక్షణకు సంబంధించిన ఒక ఆదర్శప్రాయమైన పోలికను, లేక వర్ణనమును, సమకూర్చుచున్నవి. ఆధర్శప్రాయమైన పోలికను ఛాయ మరియు నిజ రూపాలతో పోల్చుట ద్వార – వారి రక్షణను మన రక్షణతో – పోల్చుట ద్వారా మనము కొన్ని ముఖ్య పాఠములను నేర్చుకొనగలము. ఈ రెండు రక్షణలు ఎలా పోలియున్నవి?

### ఈ రెండు రక్షణలు బాప్తిస్మముతో మొదలగుచున్నవి

#### ఇశ్రాయేలు రక్షణ

*బానిసత్వము.* ఇశ్రాయేలు రక్షణ గూర్చిన కథ ఒక బానిసత్వమును గూర్చినదై యున్నది. వారిని విడిపింపవలెనని దేవుడు నిశ్చయించుకొనినంత వరకు ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలై యుండిరి. అప్పుడు వారిని విమోచనచేయువానిగా దేవుడు మోషేను పంపాడు, మరియు రాజైన ఫరో దేవుని ప్రజలను పోనిచ్చుటకు ఒప్పింపబడునట్లు ఐగుప్తు మీదికి దేవుడు మోషే ద్వారా పది తెగుళ్లను కలుగజేసాడు.

*రక్తము.* పదవ తెగులు, తొలిచూలి మరణము, వచ్చినప్పుడు పస్కా గొర్రెపిల్ల

యొక్క రక్తమును చిందించుట ద్వారా ఆ తెగులు వలన కలుగు పరిణామముల నుండి ఇశ్రాయేలీయులు విమోచింపబడ్డారు. అప్పుడు వారు దేశమును విడిచి వెళ్లవలసినదిగా రాజైన ఫరో అనుమతిచ్చాడు.

ఏదిఏమైనా, వారు ఎంతో ఎక్కువ దూరము వెళ్లక మునుపే, ఫరో తన మనస్సును మార్చుకొని బయలుదేరి వెళ్లిన ఇశ్రాయేలీయులను వెనుకకు తీసుకొనిరావలసినదిగా తన రథములను పంపించాడు. ఇశ్రాయేలీయులు దాని గుండా ఏర్పడిన పొడి నేలపై నడిచి వెళ్లగలుగునట్లు దేవుడు ఎర్ర సముద్రము నీళ్లను రెండు పాయలుగా విభజించుట ద్వారా ఆయన మరొక అద్భుతమును చేసాడు. ఇశ్రాయేలీయుల వెంటబడి తరుముటకు ఐగుప్తీయులు ప్రయత్నించినప్పుడు, సముద్రము మరలా ఎప్పటివలెనే కలిసిపోయి ఐగుప్తీయులను ముంచివేసినది. ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రమును దాటి దాని తూర్పు తీరమునకు చేరిన తరువాతనే వారి బానిసత్వములో నుండి చివరకు వారు విడిపింపబడినవారయ్యారు.

*బాప్తిస్మము.* ఇశ్రాయేలీయుల స్వాతంత్ర్య ప్రయాణము ఒక బాప్తిస్మముతో ఆరంభమైనదని వాక్యభాగము నిర్దేశించి చెప్పుచున్నది; ఐగుప్తులోని బానిసత్వము నుండి రక్షింపబడినవారు "మేఘము క్రింద నుండిరి. వారందరును సముద్రములో నడచిపోయిరి; అందరును మోషేను బట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి" (10:1బి, 2). కాబట్టి, ఇశ్రాయేలు విమోచన కథ, బానిసత్వము, రక్తము, మరియు బాప్తిస్మమును గూర్చినదై యున్నది. చివరకు వారు బాప్తిస్మము పొందినప్పుడే – ముంచడము, బాప్తిస్మము, ఇరువైపుల సముద్రము చుట్టుముట్టి యుండగా పైన మేఘము కమ్ముకొని యుండినది – ఫరో రాజుకు చేయుచుండిన బానిసత్వము నుండి వారు రక్షింపబడిరి.

**మన రక్షణ**

వారు ఎప్పుడు బాప్తిస్మము పొందారో కొరింథు క్రైస్తవులకు జ్ఞాపకము చేయుటకు పౌలు ఈ మాటల్లో నిస్సందేహముగా వర్ణించాడు. మన ప్రయాణం కూడ బాప్తిస్మముతో మొదలౌతుంది.

*బానిసత్వము.* ఇశ్రాయేలు వలెనే, మనము బానిసత్వములో – పాపమునకును సాతానునకును – ఉంటిమి (యోహాను 8:34; రోమా 6:17, 18). దాని ఫలితంగా, మనము మన పాపములలో చచ్చినవారముగాను క్రీస్తునకు దూరస్థులముగాను, నిరీక్షణలేనివారమై దేవుడు లేనివారముగాను ఉంటిమి (ఎఫెస్సీయులకు 2:1, 12).

*రక్తము.* ఇంకా కొంచెము పోల్చి చూచుకొన్నట్లయితే, మనలను విమోచించుటకు రక్తము – "లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల" రక్తము – చిందింపబడినది (యోహాను 1:29). సిలువ మీద చిందింపబడిన క్రీస్తు రక్తము ద్వారా, మనము "విమోచనము, అనగా దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి, మన అపరాధములకు క్షమాపణ" కలిగియున్నాము.

*బాప్తిస్మము.* మరొకసారి, మనము ఇశ్రాయేలీయులను పోలియున్నాము; ఏలయనగా మనము నీటి గుండా వెళ్లనంత వరకు – మనము బాప్తిస్మము పొందనంత వరకు, లేదా నీటిలో ముంచబడనంత వరకు – మనము పాపమను బానిసత్వము నుండి తప్పించుకొనలేము. బాప్తిస్మము పొందిన ఆ క్షణములో, మనము మన పాపములకు క్షమాపణ పొందుకొన్నాము (అపొస్తలుల కార్యములు 2:38), మన పాపములు కడిగివేయబడినవి (అపొస్తలుల

కార్యములు 22:16), మరియు మనము రక్షింపబడితిమి (మార్కు 16:16; 1 పేతురు 3:21). ఇశ్రాయేలీయుల వలె గాక, మనము "మోషేను బట్టి బాప్తిస్మము పొందలేదు" దానికి బదులుగా క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందియున్నాము (రోమీయులకు 6:3). మన విమోచకుడు; మన రక్షకుడు, మరియు మన ప్రభువు ఆయనే.

మనము బానిసత్వములో ఉంటిమి; మనలను విమోచించుటకు రక్తము చిందింపబడినది; మరియు ఆ తరువాత మనము బాప్తిస్మము పొందాము గనుక మన రక్షణ ఇశ్రాయేలు రక్షణతో సమానమైనది. మనము బాప్తిస్మము పొందినప్పుడు పాపము యొక్క బానిసత్వములో నుండి మనము విమోచింపబడితిమి.

## రెండు రక్షణలు కూడ వాగ్దాన దేశములో ముగియును

### ఇశ్రాయేలీయుల వాగ్దాన భూమి

ఇశ్రాయేలు వలెనే, మన ప్రయాణము ఒక "వాగ్దాన దేశము"లో, పరలోకములో[1] ముగియును. ఇశ్రాయేలీయులు కనాను దేశములో ప్రవేశించిన విషయమును (లేక మరణించిన క్రైస్తవుడు యోర్దాను నది దాటి కనాను దేశములోనికి ప్రవేశించుట) మనము పరలోకము లోనికి ప్రవేశించుట గూర్చి క్రొత్త నిబంధన ప్రత్యేకించి పోల్చనప్పటికిని, మనము పాడుకొనే కొన్ని పాటలు ఈ రెండు సంఘటనలను కలుపుచున్నవి.

### మన వాగ్దాన భూమి

ఇశ్రాయేలు కనాను దేశములోనికి ప్రవేశించుట మరియు మనము పరలోకములోనికి ప్రవేశించుట అనేక విధములలో పోల్చబడగలవు: (1) రెండు కూడ దేవుని ప్రజలకు చేయబడిన వాగ్దానములను నెరవేర్చుచున్నవి (యోహాను 14:1-3 చూడుము). (2) రెండింటిలోను ప్రవేశించు వారికి విశ్రాంతి ఉండును (మత్తయి 11:28-30; ప్రకటన 14:13 చూడుము; హెబ్రీయులకు 4:9-11తో పోల్చి చూడుము). (3) రెండింటిలోను సమృద్ధిగల దేశములో నివసించుట కలదు (నిర్గమకాండము 3:8; సంఖ్యాకాండము 13:27 చూడుము; ప్రకటన 22:1, 2తో పోల్చి చూడుము). మనకు వాగ్దానము చేయబడిన ఆ దేశము యొక్క అందచందాలు మరియు ఆశీర్వాదములు, మనలను దాని వైపునకు ఆకర్షించుచు, ఒక ఆయస్కాంతము వలె ఉండవలెను.

## అరణ్యములో సంచరించినంత కాలము<br>రెండు రక్షణలు విశ్వసనీయతను కలిగియున్నాయి

ఇశ్రాయేలీయులు అరణ్యములో నలుబది సంవత్సరములుండిరి. వారు అరణ్యములో గడిపిన ఈ కాలమును పౌలు మనము క్రైస్తవులముగా సంఘములో గడువు కాలమునకు – అది ఎంత దీర్ఘమైనదైనను – పోల్చుచున్నాడు. బహుశ వారు అరణ్యములో గడిపిన కాలము వారికి ఒక పరీక్షా కాలమై యుండినట్లే, మన కాలము కూడా అలాగే ఉండునను భావమునివ్వవలెనని, ఆయన ఉద్దేశించి యుండును. క్రైస్తవ జీవితము ఒక పరీక్షా కాలమై యున్నది.

**అరణ్యములో ఉండగా దేవుని చేత దీవింపబడిరి**

*ఇశ్రాయేలీయుల దీవెనలు.* వారు అరణ్యములో గడిపిన సమయములో, దేవుడు ఇశ్రాయేలీయులను దీవించాడు. వారిపై దాడి చేయబడినప్పుడు, ఆయన వారిని కాపాడాడు, వారి ప్రయాణమంతటిలో ఆయన వారికి మార్గనిర్దేశనమును సమకూర్చాడు. పౌలు, 10:3, 4లో, దేవుడు వారికి ఆహారమును పానీయమును అనుగ్రహించాడని ప్రత్యేకించి చెప్పాడు: "అందరు ఆత్మ సంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి; అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి,[2] ఏలయనగా "తమ్మును వెంబడించిన ఆత్మ సంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే."[3] వారు ఆకలిగొనియుండగా దేవుడు ఇశ్రాయేలుకు మన్నాను మరియు పూరేడులను (నిర్గమకాండము 16) మరియు వారు దాహముగొనియుండగా బండలో నుండి నీళ్లను (నిర్గమకాండము 17; సంఖ్యాకాండము 20) సమకూర్చిన కథలను పాత నిబంధన తెలియజెప్పుచున్నది. పౌలు, "ఆ బండ క్రీస్తే" అని చేయుచున్న ప్రకటన క్రీస్తే – కుమారుడైన దేవుడు, దైవత్వములోని రెండవ వ్యక్తి – ఇశ్రాయేలీయులు అరణ్యములో దీవింపబడుటకు అనువైన సాధనమై యుండెనని సలహా ఇచ్చుచున్నది.

*మన దీవెనలు.* ఇశ్రాయేలు అరణ్యములో దీవింపబడినట్లే; మనము మన క్రైస్తవ జీవితములలో దీవింపబడుదుము. వారు "ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును" తినుట మరియు "అత్మసంబంధమైన ఒకే పానీయమును" త్రాగుట "మనము తినుచున్న మరియు త్రాగుచున్న దాని వంటిదే" అని అర్థమీయవచ్చును. దేవుడు ఆత్మ సంబంధమైన ఒకే పౌష్టికాహారముతో – మనలను దీవించుచున్నట్లుగానే – వారిని దీవించాడు.

మనము ఈనాడు ఆధ్యాత్మిక ఆహరముతో దీవింపబడుచున్నామని మనము ఆలోచించునప్పుడు, క్రీస్తే "జీవాహారమై" యున్నాడనియు (యోహాను 6:35) మనకు "జీవ జలము" నిచ్చుచున్నాడనియు (యోహాను 4:10) మనము జ్ఞాపకము చేసికొందము. ఇంతేగాక, మనము ఆధ్యాత్మికముగా ఎదుగుటకు మనకు "వాక్యమను పాలను" సేవించగల సౌకర్యమున్నది (1 పేతురు 2:2).[4]

**ఇశ్రాయేలు అవిధేయులైరి**

ఏదిఏమైనా, ఇశ్రాయేలు అరణ్యములో కాలము గడుపుచుండినప్పుడు, వారు విశ్వాసనీయమైనవారై యుండవలెనని కోరబడినది. ఇశ్రాయేలీయులలో అధిక సంఖ్యాకులు విశ్వాసనీయమైనవారై యుండకపోవుట పెద్ద సమస్యయై యుండినది. "అయితే వారిలో ఎక్కువ మంది దేవునికిష్టులుగా ఉండకపోయిరి గనుక అరణ్యములో సంహరింపబడిరి" అని పౌలు చెప్పుచున్నాడు (10:5). ఈ వచనములోని "ఎక్కువ" అను పదము పౌలు చెప్పుచుండిన దానికి తారతమ్యముగా ఉన్నది. ఇశ్రాయేలీయుల గూర్చి ఆయన "అందరు" అని ఐదుసార్లు చెప్పాడు: "అందరు" మేఘము క్రింద నుండిరి, సముద్రములో నడచిపోయిరి, బాప్తిస్మము పొందిరి, అత్మ సంబంధమైన ఆహారమును భుజించిరి, ఆత్మ సంబంధమైన పానీయమును త్రాగిరి. ఏదిఏమైనా, వారిలో "ఎక్కువ" మంది దేవునికి ఇష్టులై యుండుటలో విఫలులయ్యారు. నిజ స్థితి కంటె ఎంత అసంపూర్తియైన ప్రకటన కదా! దాదాపుగా ఇశ్రాయేలు దేశ ప్రజలందరు పాపము చేసారు మరియు వాగ్దాన దేశములో ప్రవేశించుటకు అనుమతింపబడకపోవుట ద్వారా శిక్షింపబడ్డారు.

"వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు మనకు దృష్టాంతముగా ఉన్నవి" (10:6).[5] మనము కూడ ఇటువంటి పాపముల విషయములో దోషులమై యుండగలమని పౌలు చెప్పుచున్నాడు! కాబట్టి మనము వాటి గూర్చి జాగరూకులమైయుందాము! ఇశ్రాయేలీయులు చేసినవి మరియు మనము చేయకూడనివైన నాలుగు "చెడ్డ విషయముల" గూర్చి పౌలు ప్రత్యేకముగా పేర్కొనుచున్నాడు.

(1) *విగ్రహారాధన:* "వారిలో కొందరి వలె, మీరు విగ్రహారాధికులై యుండకుడి" (10:7బి). మోషే దేవుని నుండి ధర్మశాస్త్రమును పొందుటకు పర్వతము మీద ఉండినప్పుడు, ఇశ్రాయేలీయులు ఒక బంగారు దూడ విగ్రహమును చేసికొని దానిని ఆరాధించారు (నిర్గమకాండము 32 చూడుము). తత్ఫలితంగా, లేవీయుల చేత అనేకులు సంహరింపబడిరి, తెగులు చేత ఇతరులు మరణించిరి.

(2) అవినీతి: "వారి వలె మనము వ్యభిచరింపక యుందుము" (10:8). ఇశ్రాయేలీయులు మోయాబు స్త్రీలతో జారత్వము చేసిన సంఘటన గూర్చి మనము సంఖ్యాకాండము 25లో చదువుదుము. దాని ఫలితమేమిటి? జనులు వేల కొలది సంఖ్యలో మరణించారు![6]

(3) *క్రీస్తును శోధించుట:* "మనము ప్రభువును శోధింపక యుందము" (10:9). పౌలు మనస్సులో ఉండిన ప్రత్యేకమైన సందర్భము సంఖ్యాకాండము 21:5లో కలదు: "కాగా ప్రజలు దేవునికిని మోషేకును విరోధముగా మాటలాడి, 'ఈ అరణ్యములో చచ్చుటకు ఐగుప్తులో నుండి మీరు మమ్ము నెందుకు రప్పించితిరి? ఇక్కడ ఆహారము లేదు, నీళ్లు లేవు, చవిసారములు లేని యీ అన్నము మాకు అసహ్యమైనదనిరి." అసలేం జరిగింది? "యెహోవా ప్రజలలోనికి తాపకరములైన సర్పములను పంపెను మరియు అవి ప్రజలను కరువగా ఇశ్రాయేలీయులలో అనేకులు చనిపోయిరి" (21:6).

(4) *సణుగుట:* "మీరు సణుగకుడి, వారిలో కొందరు సణిగి, సంహారకుని చేత నశించిరి" (10:10). మోషే మరియు అహరోనుల నాయకత్వమునకు విరోధముగా కోరహు, దాతాను, మరియు అబీరాము నాయకత్వము వహించిన సందర్భమును పౌలు సూచించుచుండవచ్చును, ఫలితంగా వారు మరియు తిరుగుబాటులో పాల్గొనినవారును దేవుని కార్యముల చేత చంప బడిరి. తిరుగుబాటుకు నాయకత్వము వహించినవారి కుటుంబములను భూమి మ్రింగివేసినది, ఇతర లేవీయ తిరుగుబాటుదారులను ఆకాశము నుండి దిగివచ్చిన అగ్ని దహించివేసినది, మరియు ఒక తెగులు వారిని వెంబడించుచుండినవారిలో నుండి 14,000 మంది కంటె ఎక్కువ సంఖ్యలో నాశనము చేసినది (సంఖ్యాకాండము 16).

### ఇశ్రాయేలీయులు అవిధేయులైనట్లుగా క్రైస్తవులు అవిధేయులై యుండకూడదు

ఎలాగైతే ఇశ్రాయేలీయులు చేసిన పాపములు చేయుచు కొరింథీయులు దోషులై యుండిరో, మనము కూడ అలాగే దోషులమై ఉండే అవకాశముంది.

(1) మనము విగ్రహారాధన విషయములో *దోషులమై* యుందుమా? మనము డబ్బునుగాని క్రీడలకుగాని వినోదములకుగాని దేవుని కంటె ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చుచున్నామా? మనము దేనినైనను దేవుని మరియు ఆయన కార్యముల కంటె ముందుంచుకొంటామో, దానిని మనము ఒక విగ్రహముగా చేసికొనుచున్నామని అర్థము.

(2) మనము అవినీతి – జారత్వము లేక వ్యభిచారము – విషయములో దోషులమై

యుందుమా? మనము శరీరధారులమైనందు వలన, మానవులు ఎల్లప్పుడు గురియైన అవే శోధనలకు మనము కూడ గురియగుటకు అవకాశములు మెండు, మరియు లోకులు అవినీతిగా ప్రవర్తించునట్లు వారిని ఎడతెగకుండా శోధించు లోకములో మనము జీవించుచున్నాము. అవినీతిలో నిమగ్నమైయుండుటకు క్రైస్తవుడు శోధింపబడగలడా? ఈ సందర్భములో జిమ్మీ అలెన్‌గారి వ్యాఖ్యానము పునరుక్తము చేసికొనదగినది: స్త్రీపురుష కామకేళి గూర్చి అతడు శోధింపబడలేడని చెప్పేవాడు అతని భావావేశములు అభివృద్ధికానంతటి పిన్న వయస్కుడును, అతని శరీరములో ఏమి జరుగుచున్నదో తెలియనంత అజ్ఞానియు, లైంగీక కోరికలు అణగిపోయినంత వృద్ధుడై, యథాప్రకారమైన మనిషి కానివాడై యున్నాడు లేదా అతడు అబద్ధమాడుచున్నాడు."[7]

(3) మనము ప్రభువును *శోధించుచుండు* విషయములో దోషులమై యుందుమా? నమ్మకము మరియు విధేయతకొరతయగుటనుబట్టి మనము ఆయన సహనమును పరీక్షించినప్పుడు, మనము ఆయనను శోధించుచున్నవారమౌదుము; అవిధేయులను ఆయన శిక్షించునను బెదిరింపును ఆయన నిజముగా అమలు చేయడన్నట్లుగా మనము ప్రవర్తించుచున్నాము.

(4) మనము దేవునికి విరోధముగా, *సణుగుచుండు లేక గొణుగుచుండు* విషయములో దోషులమై యుందుమా? మనము ఆయన యెదుట వెలిబుచ్చుచున్న అంసతృప్తి, ఆయన మనకు చేసిన ఉపకారములకు కృతజ్ఞతలేదనుటకును మనకు ఏది ఉత్తమమైనదో దానినే ఆయన మన యెడల మరియు ఆయన కార్యముల యెడల ఎల్లప్పుడు చేయునను నమ్మకము కొదువయై యున్నదనుటకును నిదర్శనమునిచ్చు ఎడతెరపిలేని మన సణుగుడు గూర్చి దేవుడు ఏమనుకుంటున్నాడు?

ఔను, ఎంతో మంది ఇశ్రాయేలీయులు నాశనమగుట హేతువైన అవే పాపముల గూర్చి నేటి క్రైస్తవులు సహితము దోషులైయున్నారని పరిగణింపబడవచ్చును. చెప్పలేనన్ని ఇతర పాపముల విషయములో కూడ మనము దోషులమైయుందుము. ఇశ్రాయేలు వలెనే, క్రైస్తవులు సహితము పట్టువిడువక పాపము చేయుచునేయున్నట్లయితే, దాని ఫలితమేమైయుండును? ఇశ్రాయేలీయులు చేసిన పాపము మరియు అందును బట్టి దేవుడు వారిని శిక్షించుట మనకు ఉదాహరణములైయున్నవనియు "మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను" అనియు పౌలు చెప్పుచున్నాడు (10:11). ఇశ్రాయేలీయులు అరణ్యములో కూలినట్లే, నేటి క్రైస్తవులు కూడ ఉపమానాలంకారముగా ఆరణ్యములో కూలిపోగలరు; వారు పాపము చేయుచునే ఉండవచ్చు, కానీ దాని ఫలితంగా వారి ఆత్మలను నశింప జేసికొందురు. పౌలు ఇక్కడ స్వధర్మ భ్రష్టత – క్రైస్తవులు క్షీణించిపోయి శాశ్వతంగా నశించిపోవుదురను వాస్తవము – సాధ్యమగుట గూర్చి బోధించుచుండెను. కాబట్టి, మనకు వాగ్దానము చేయబడిన దేశములో మనము ప్రవేశించకుండా ఆటంకపరచు ప్రతి పాపము నుండి తొలగించుకొని వాటికి దూరముగా ఉందము.

## ముగింపు

ఈ పాఠమునకు ముగింపును 12 మరియు 13 వచనములలో పౌలే సమకూర్చాడు. ఆయన ఒక హెచ్చరికను మరియు ఒక వాగ్దానమును ఇచ్చుచున్నాడు.

మొదటిగా, 12వ వచనములో, హెచ్చరికను చూడవచ్చును: "కాబట్టి, తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను." కొరింథీయులు అమితమైన ఆత్మవిశ్వాసమును కలిగియుండిన అపాయములో ఉండిరి. వారి నిత్య రక్షణ గూర్చిన హామీ వారికున్నదని వారనుకొనుచుండిరి; కాబట్టి, వారు దేవునికి లోబడుచుండిరను నిశ్చయతను రూఢిపర్చుకొనుటకు ఉండవలసినంత జాగ్రత్తగా ఉండలేదు. ఏదైన ఒకజట్టు పోటీ పడుటకు అమితమైన ఆత్మవిశ్వాసంతో వెళ్లి పోటీలో పాల్గొనినప్పుడు, వారు ఆజాగ్రత్తపరులై యుంటూ పోటీలో ఓటమి పాలగుటకు అవకాశము కలదు. ప్రమాదకరమైన వృత్తి పనులు చేయుచుండువారు ఎల్లప్పుడును అప్రమత్తముగా ఉండవలెను; వారు ఏ పొరపాటునైనను చేయరని అనుకొనుటకు ఆరంభించనప్పుడే, వారు తమ్మునుతామే గాక ఇతరులను కూడ చంపివేయు అతి గొప్ప అపాయములో ఉన్నవారగుదురు. కాబట్టి, మనము, పౌలు ఇచ్చుచున్న సలహాను పాటించుదము. మనము క్షీణించి రాలిపోయి శాశ్వతంగా మన ఆత్మలను నశింపజేసుకొనకుండునట్లు, ఎడతెరపి లేకుండా అప్రమత్తముగాను అమితోత్సాహముతోను ఉందుము.

ఒక వాగ్దానముతో పౌలు ఈ భాగమును ముగించుచున్నాడు: "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు దేవుడు నమ్మదగినవాడు, మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింప గలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (10:13). మనము ఒక ప్రక్క పాపము చేయుకుండునట్లు తగు జాగ్రత్తగలవారమై యుంటూ, మరొక ప్రక్క పాపము చేయుట అనివార్యము కాదని కూడ తెలిసికొని యున్నవారమై యుండవలెను. మనము ఏ విశిష్టమైన విధముగానైతేనేమి లేదా సహింపలేని రీతిలోనైతేనేమి శోధింపబడమని దేవుడు మనకు అభయమునిచ్చాడు, కానీ మానవులందరికి వలెనే శోధింపబడుదుము. శోధనను ఎదిరించుటకు గల మన శక్తికి మించి మనలను శోధింపబడనీయుడు, కానీ ప్రతి శోధన నుండి తప్పించుకొనగల మార్గమును ఆయన సమకూర్చును. శోధనను ఎదిరించుచు పడిపోకుండుటకు గల మన సామర్థ్యము, మొట్టమొదటిగా, దేవుడు మరియ దేవుని సదుపాయములపై ఆధారపడి యుండును. ఆయన నమ్మదగినవాడు, గనుక మనము ఆయనను నమ్మవచ్చును. ఏది ఏమైనా, అది మన మీద కూడా ఆధారపడి యుండును. శోధనను తప్పించుకొను మార్గమును దేవుడు చూపిస్తాడు, కానీ మనము దానిని సానుకూలంగా సద్వినియోగము చేసికొనవలెను; మనము తప్పించుకొనవలెను.[8] దేవుని వాగ్దానము మనకున్నది గనుక, మనము పాపమునకు దూరముగా ఉండ గలము. మనము పాపము చేసినట్లయితే, అది దేవుని పొరపాటు కాదు; అందుకు మనలను మనమే నిందించుకొనవలెను.

---

సూచనలు

[1]మనము మరణించిన తరువాత పరలోకమునకు తీర్పు తరువాత వెళ్లినా, లేక మనము యింకా జీవించి యున్నప్పుడే, మనము "మార్పు" నొందినప్పుడే, క్రీస్తు తిరిగి వచ్చిన తరువాత వెళ్లినా ఈ ప్రకటన మాత్రం యథార్థమైనది (1 కొరింథీయులకు 15:51). [2]ఆహార పానీయములు "ఆధ్యాత్మికమైనవై" యుండెను అనగా, వాటి మూలాధారము ఆధ్యాత్మికమైనదై యుండెను; అవి స్వాభావికమైన మార్గములలో పొందుకొనబడుటకు బదులుగా దేవుని చేత అనుగ్రహంపబడినవి. [3]"వారిని వెంబడించిన

ఆత్మ సంబంధమైన బండ" గూర్చి మాట్లాడుచూ, వారు అరణ్యములో గడిపిన సంవత్సరములన్నిటీలోను క్రీస్తు ఇశ్రాయేలుతో కూడ ఉండెనని పౌలు సూచించుచున్నాడు. ఇంకా, దేవుడు "ఇశ్రాయేలుయొక్క ఆశ్రయదుర్గము" అని పిలువబడుచున్నాడు (ద్వితీయోపదేశకాండము 32:4, 15, 18: యెషయా 17:10; 26:4 చూడుము). (Lipscomb, 146.) [4]దేవుడు ఇశ్రాయేలీయులకు సమకూర్చిన "ఆత్మసంబంధమైన ఆహారము" మరియు "అత్మసంబంధమైన పానీయము" క్రైస్తవ యుగములోని ప్రభురాత్రి భోజనమునకు సాదృశ్యమై యున్నవని అనేక మంది వ్యాఖ్యాన కర్తలు అభిప్రాయపడుదురు. ఇదే దృక్పథము Jimmy Allen, *Survey of First Corinthians,* 3d ed. (Searcy, Ark.: By the Author, 1989), 118లో నివేదింపబడినది. [5]"ఇశ్రాయేలీయులు దేవుడు ఇవ్వక మానిన వాటి గూర్చి పేరాసగలవారయ్యారు మరియు ఇచ్చిన వాటి గూర్చి సణిగారు (సంఖ్యాకాండము 11:4, 33, 34)" (McGarvey and Pendleton, 100). [6]"ఒక్క దినముననే యిరువది మూడు వేల మంది కూలిరి" అని పౌలు చెప్పుచున్నాడు. ఏదిఏమైనా, "ఇరువది నాలుగు వేల మంది ఆ తెగులు చేత చనిపోయిరి" అని సంఖ్యాకాండము 25:9 చెప్పుచున్నది. పౌలు సంఖ్యాకాండములో 25లో వ్రాయబడియున్న సందర్భమును కాదు గానీ, నిర్గమకాండము 32:25లో పేర్కొనబడిన దానిని సూచించుచున్నాడనియు, సంహరింపబడినవారి మొత్తము సంఖ్యాకాండము 23,000 అని పౌలు తానే మనకు తెలియజేయుచున్నాడనియు Gleason L. Archer తిరస్కరించుచున్నాడు (Gleason L. Archer, *Encylopedia of Bible Difficulties* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1982], 401.) [7]Allen, 120. [8]George W. DeHoff, *Sermons on First Corinthians* (Murfreesboro, Tenn.: Christian Press, 1947), 84.